ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
సోమవారం 13 అక్టోబరు 2025


ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు

నిధుల విడుదలపై హర్షం

మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం


మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

గోదావరిఖని, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రామగుండం నియోజక వర్గంలో ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కృషి చేస్తున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు కృతజ్ఞతలు తెలుపుతూ గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు కామ విజయ్ ఆధ్వర్యంలో ఎంపీ వంశీకృష్ణ, మంత్రులు వివేక్, శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణాసంచ కాల్చారు. విజయ్ మాట్లాడుతూ అంతర్గాంలో 591 ఎకరాల స్థలంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రీ ఫిజిబులిటీ స్టడీ కోసం రూ.40.53లక్షలను ఎయిర్‌పోర్టు అథారిటీకి చెల్లింపులు చేయడంలో ఎంపీ కీలక పాత్ర పోషించారని, అంతర్గాంలో ఎయిర్ పోర్టు ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడుగు వేయడంలో ఎంపీ పాత్ర మరువలేనిదన్నారు. రామగుండంలో ఎయిర్ పోర్టు వస్తే కనెక్టివిటీ పెరిగి వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని, రామగుండం ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందన్నారు. నాయకులు అనుమాస శ్రీనివాస్ జీన్స్, వాసర్ల సురేందర్, హకీం, తిప్పారపు మధు, నరేందర్‌రెడ్డి, ముచ్చకుర్తి మహేష్, కిశోర్, జావెద్, శ్రీకాంత్, శ్రీను, మహేందర్, శేఖర్, అశోక్, శ్రావణ్, సతీష్ పాల్గొన్నారు.

హత్య కేసు దర్యాప్తు పారదర్శకంగా జరపాలి 6

- యైటింక్లయిన్‌కాలనీ

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు

- వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ తరలింపు
- బొక్కలవాగు కట్ట పై తాత్కాలిక షెడ్ల నిర్మాణం


కట్టపై తాత్కాలికంగా నిర్మిస్తున్న షెడ్లు

మంథని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కూరగాయల, చికెన్, మటన్ మార్కెట్‌ను తాత్కాలికంగా బొక్కలవాగు కట్ట మీదకు తరలించడానికి మున్సిపల్ కమిషనర్ మనోహర్ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. బొక్కలవాగు కట్ట పై ఉన్న ఓపెన్ జిమ్ సమీపంలో విశాలమైన స్థలంలో కూరగాయల, చికెన్, మటన్ మార్కెట్ ఏర్పాటు చేయటానికి తాత్కాలికంగా తడకలతో షెడ్లు నిర్మించడానికి శ్రీకారం చుట్టారు. ఈ మూడు విభాగాల్లో తమ వద్ద ఉన్న రికార్డుల ప్రకారం ఉన్న వ్యాపారుల సంఖ్య ఆధారంగా బాక్స్‌లను మార్కింగ్ చేసి తడకలతో షెడ్లు నిర్మిస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో షెడ్ల నిర్మాణం పూర్తయి తర్వాత వ్యాపారులను అక్కడి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి


కూరగాయల మార్కెట్ (ఫైల్)

దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ. 7 కోట్ల నిధులు ఏడాది క్రితం మంజూరయ్యాయి. ప్రస్తుతం మార్కెట్ ఉన్న స్థలంలో ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ అధునాతన భవనాన్ని నిర్మించడానికి చర్యలు చేపట్టనున్నారు. ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణం కోసం నిధులు మంజూరైనప్పటికీ మార్కెట్‌లో వ్యాపారుల తరలింపు లేని కారణంగా నిర్మాణ పనుల ప్రారంభంలో జ్యాపం జరుగుతంది. దీంతో మున్సిపల్ కమిషనర్ మనోహర్ మార్కెట్ తరలింపు, ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ భవన నిర్మాణాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుత మార్కెట్‌ను బొక్కలవాగు కట్టపైకి తరలించడానికి ఏర్పాటు చేస్తున్నారు. మార్కెట్‌లోని కూరగాయల వ్యాపారులు మాత్రం మార్కెట్ భవన నిర్మాణం పూర్తి అయ్యేంత వరకు తమకు బస్టాండ్ లేదా ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో తాత్కాలికంగా కూరగాయలు అమ్ముకోవటానికి అనుమతి ఇవ్వాలని కోరుతున్నారు. బస్టాండ్‌లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, గ్రౌండ్‌లో ఉంటే విద్యార్థుల విద్యా బోధనకు ఇబ్బందని మున్సిపల్ కమిషనర్, అధికారులు భావిస్తున్నారు. బొక్కలవాగు కట్టపై ఉంటే ఎవరికి ఎలాంటి ఇబ్బందులు ఉండవని, పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలు

(మిగతా 8వ పేజీలో)

హిందూ సమాజ ఐక్యతకు ఆర్ఎస్ఎస్ కృషి

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): హిందూ సమాజాన్ని ఐక్యత చేయడానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కృషి చేస్తుందని కరీంనగర్ విభాగ్ సద్భావన్ ప్రముఖ్ కొండేటి బాలరాజు, సహ కార్యవాక్ కొంపెల్లి రాజన్న అన్నారు. ఆదివారం గోదావరిఖనిలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పథ సంచాలన కార్యక్రమం సందర్భంగా సమరోక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తీసుకున్న వ్యక్తి నిర్మాణంలో భాగంగా దేశ నిర్మాణం, దేశ పూర్వవైభవ స్థితికి రావాలని, హిందు సమాజాన్ని జాగృతి పరచడం, వ్యక్తి నిర్మాణం కోసం రోజువారీ శాఖ నిర్వహణ, సమాజంలో మార్పులు తీసుకురావడం కోసం ప్రయత్నం చేస్తున్నట్టు తెలిపారు. పర్యావరణం, కుటుంబ ప్రబోధం తీసుకుని సమాజంలో అఖండత వైపు పరిపూర్ణ హిందు సంఘటితానికి ఆర్ఎస్ఎస్ కృషి చేస్తుందని చెప్పారు. 1925లో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నామని, ఈ కార్యక్రమాలు 2026వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. అనంతరం కరసేవకులు సమరోక్ కార్యక్రమాన్ని పుర వీధుల నుంచి నిర్వహించగా మహిళలు పూలతో స్వాగతం పలికారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి గాంధీనగర్, లేబర్ కోర్టు, చౌరస్తా, లక్ష్మీనగర్, కళ్యాణ్‌నగర్, స్వతంత్ర చౌక్, మార్కండేయకాలనీ మీదుగా ర్యాలీ సాగింది. నగర కార్యవాహక్ పైడిపెల్లి రాంమూర్తి, మంథెన శ్రీనివాస్, మధుకర్‌తో పాటు వివిధ విభాగాల కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ రక్షణే స్వయం సేవకుల లక్ష్యం

మంథని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణే స్వయం సేవకుల తొలి లక్ష్యమని ఆర్ఎస్ఎస్ కరీంనగర్ విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ దావులూరి మురళీధర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్వయం సేవకులు మంథని పట్టణ పురవీధుల్లో ఆదివారం పథ సంచాలన్ నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్‌లో జరిగిన సభలో మురళీధర్ మాటాడుతూ.. ఆర్ఎస్ఎస్ వంద సంవత్సరాలుగా శాఖ పద్ధతి ద్వారా వ్యక్తి నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. దేశ రక్షణ కోసం స్వయం సేవకులు నిరంతరం కృషి చేస్తారన్నారు. గర్రెపల్లి వెంకటేశ్వర్లు, మాడిశెట్టి సుదర్శన్ సురేందర్, లింగం శంకర్, నాంపెల్లి రమేష్, పుట్ట సదయ్య, కనుకుంట్ల స్వామి, మేడగోని రాజమౌళిగౌడ్, పెండ్యాల లిఖిత్, అకుల సాగర్, తూర్పాటి రాము, రావుల సతీష్, నరేండ్ల రాజేష్, అధిక సంఖ్యలో స్వయం సేవకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



పాలకుర్తి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి మండలం బసంత్‌నగర్ పోలీ స్టేషన్ ఎస్ఐగా నూతి శ్రీధర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ ఎస్ఐగా పని చేసిన ఆర్ స్వామి వీఆర్‌కు బదిలీ అయ్యారు. రామగుండం కమిషనరేట్‌లో ఉన్న శ్రీధర్ బసంత్‌నగర్‌కు బదిలీ అయ్యారు. శ్రీధర్ మాట్లాడుతూ నిత్యం శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గతంలో అంతర్గాంలో పనిచేశానని, ఈ ప్రాంతంపై అవగాహన ఉందన్నారు. ఆయనకు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల కోసం గ్రామస్థుల శ్రమదానం

- ధర్మారం మోడల్ స్కూల్‌కు పలు గ్రామాల నుంచి విద్యార్థుల రాకపోకలు
- రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, చెట్లు
- పదిహేను రోజులుగా బస్సు బంద్
- రెండు రోజుల్లో 6 కిలో మీటర్ల మేర పిచ్చిమొక్కల తొలగింపు


శ్రమదానం చేస్తున్న గ్రామస్థులు

ధర్మారం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు గ్రామాల పరిధిలో 6కిలో మీటర్ల మేర రోడ్డు వెంట ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు పెరిగి ఆర్టీసీ బస్సు రావడం లేదు. దీంతో ఆ గ్రామాలనుంచి సుమారు 50మంది పాఠశాలకు వెళ్లే విద్యార్థుల ఆటోలపై ఆధారపడి నానా తంటాలు పడుతున్నారు. విద్యార్థుల ఇబ్బందులను అర్థం చేసుకున్న గ్రామస్థులు స్వచ్ఛందంగా శ్రమదానికి పూనుకుని రెండు రోజుల్లో 6కిలోమీటర్ల మేర చెట్లను తొలగించి విద్యార్థుల భవిష్యత్తుకు బడి బాటలు వేశారు.

మండలంలోని కొత్తూరు, న్యూకొత్తపల్లి, చామనపల్లి, కటికెనపల్లి గ్రామాల నుంచి సుమారు 50మంది విద్యార్థులు ధర్మారం మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్లో చదువుతుంటారు. పెద్దపల్లి నుంచి ఈ గ్రామాల మీదుగా నడిచే ఆర్టీసీ బస్సే ఈ విద్యార్థులకు ఆధారం. ఇది కేవలం విద్యార్థుల కోసమే నడిచే బస్సుగా చెప్పవచ్చు. ఎందుకంటే పాఠశాల సెలవు దినాల్లో ఈ బస్సు నడవదు. అలాంటి బస్సు నాలుగు గ్రామాల పరిధిలో రోడ్డు వెంట పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు, ఏపుగా పెరిగిన చెట్టు కొమ్మలు రోడ్డు పైకి వచ్చి బస్సు అద్దాలు ధ్వంసం అవుతున్నాయని పదిహేను రోజులుగా బస్సు నడవడం లేదు. దీంతో సెలవుల అనంతరం విద్యార్థులు ఆటోలపై ఆధారపడి నానాతంటాలు పడుతూ పాఠశాలకు చేరుకుంటున్నారు. మోడల్ స్కూల్ ధర్మారం బస్టాండ్ నుండి దాదాపు రెండు కిలో మీటర్లు ఉంటుంది. బస్సు అయితే ప్రయాణికులందరిని బస్టాండ్‌లో దింపిన తరువాత విద్యార్థులకోసం మోడల్ స్కూల్ వరకు వెళ్లి వస్తుంది. ఇలా ఉదయం ట్రిప్పులో విద్యార్థులను దింపిన బస్సు మళ్లీసాయంత్రం ట్రిప్పులో విద్యార్థులను ఎక్కించుకొని వారి గమ్యస్థానాలకు చేరుస్తుంది. బస్సు బంద్ కావడంతో విద్యార్థులంతా ఆటోల్లో వచ్చి అనంతరం మోడల్ స్కూల్ వరకు బ్యాగులు వేసుకొని నడవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఈ పరిస్థితితో బీజేపీ మండల అధ్యక్షుడు తీగుళ్ల సతీష్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేల్పుల నాగరాజు ప్రోత్సహంతో చామనపల్లి, కొత్తపల్లి న్యూ గ్రామస్థులంతా ఒక్కటై శ్రమదానానికి పూనుకున్నారు. 6 కిలో మీటర్ల మేర రోడ్డు వెంట ఏపుగా పెరిగిన చెట్లను, ముళ్ల పొలను తొలగించి రహదారిని క్లియర్ చేశారు. గ్రామస్థుల సమిష్టి కృషితో చదువుకోసం అష్టకష్టాలు పడుతున్నా విద్యార్థుల బడికి బాటలు వేశారు. మాజీ ఉప సర్పంచ్ ఐతరవేని వేణు, రమేష్, జుంజుపల్లి సురేందర్, సుందరగిరి చందు, కొమ్మ లచ్చయ్య, ఆవుల సంపత్, తిరుపతి, శివ, నర్సయ్య, నందినేని సంతోష్, అరుణ్, కునారపు రాములు, బోగెగట్టు తదితరలు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్ కోసమే శ్రమదానం

వేల్పుల నాగరాజు (చామనపల్లి మాజీ ఎంపీటీసి)



చదువు కోసం కష్టపడి విద్యార్థులు ఆటోలో వెళ్లడం, ధర్మారం దిగి అక్కడి నుంచి మోడల్‌స్కూల్ వరకు నడవడం బాధేసింది. అందుకే గ్రామస్థులంతా కలిసి శ్రమదానం చేయలేమా అని నిర్ణయం తీసుకున్నాం. అనుకున్న ప్రకారం శుక్రవారం నుంచి ఆదివారం వరకు 6 కిలోమీటర్ల మేర రోడ్డుకు అడ్డంగా పెరిగిన చెట్లను తొలగించాం. విద్యార్థుల భవిష్యత్ కోసం గ్రామస్థులం అంతా సిద్ధంగా ఉన్నాం. గోదావరిఖని డిపో బస్సు ఒక్కటే నడవడం వల్ల విద్యార్థులకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. గతంలో కరీంనగర్ నుండి కుమ్మరికుంట వరకు కరీంనగర్ డిపో బస్సు నడిచేది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చొరవ తీసుకొని బస్సును మళ్లీ పునరుద్ధరించాలని కోరుతున్నాం.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ



మాట్లాడుతున్న బీఎస్‌పీ నేతలు

మంథని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి వరికిల్ల మల్లేష్, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి జనగామ రవికుమార్‌లు ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. సుమారు 52 శాతం ఉన్న బీసీ వర్గాలు రిజర్వేషన్లు అడగటం సమంజసం కాదన్నారు. ఐదు శాతం ఉన్న వారు పాలకులుగా బీసీలను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే బీసీలకు సరైన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. తమ పార్టీ తరుపు వచ్చే స్థానిక సంస్థల్లో బీసీలకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామన్నారు. నర్ల గోపాల్ యాదవ్, కాంపెల్లి బాబు, బొంకూరి దుర్గయ్య, ఇరుగురాల సదానందంలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మూల మలుపులు

- ఆందోళనకు గురవుతున్న వాహనదారులు


విలోచవరం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మంథనిరూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మూడు గ్రామాలకు రింగు రోడ్డుగా ఉన్న రహదారి వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. మంథని-గోదావరిఖని ప్రదాన రహదారిని అనుకొని విలోచవరం, పోతారం, ఉప్పట్ల గ్రామాలను కలుపుతు నిర్మించిన బిటి రోడ్డు ప్రమాదకరంగా మారింది. మంథని-గోదావరిఖని ప్రదాన రహదారి నుంచి మొదలు కొని ఉప్పట్ల గ్రామం వరకు ఉన్న బిటి రహదారికి పలు చోట్ల మూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. విలోచవరం, పోతారం, ఉప్పట్ల గ్రామాల సమీపలలో మూల మలుపులు ఉండటంతో వాహనదారులు, నడిచి వెళ్ళేవారు భయందోళనకు గురి అవుతున్నారు. మూడు గ్రామాల వరకు రహదారి పై సుమారు పది వరకు మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. సింగిల్ బిటి రోడ్డు కావడంతో రోడ్డుకు ఇరువైపులా పంట పొలాలు ఉండటంతో పాటు ఇతర చెట్లు ఉండటం కారణంగా అవి రోడ్డు పైకి ఉండటంతో మూల మలుపుల వద్ద వాహనాలకు ఇరువులా కనిపించకుండ పోతుంది. దీంతో వాహన దారులు, పొలాలకు నడిచి వెళ్లే రైతులు ప్రమాదాలకు గురికావాల్సి వస్తుంది. మూల మలుపుల వద్ద ఆర్అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయక పోవడంతో వాహనదారులు వేగంగా ప్రయాణిస్తు న్నారు. దీంతో అదుపుతప్పి వాహన దారులు ప్రమాదాలకు గురి కావల్సి వస్తుంది. రహదారి పై మూల మలుపుల వద్ద ఉన్న చెట్లను తొలగించడం తోపాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలను నివారించవచ్చునని గ్రామస్థులు కోరుతున్నారు. అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద హెచ్చరికల బోర్డులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


పోతారం వద్ద ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

సుల్తానాబాద్ చెరువు అభివృద్ధిపై నిర్లక్ష్యం

- దశాబ్దాలుగా నెరవేరని మినీ ట్యాంక్ బండ్ కల
- కళ తప్పుతున్న పెద్ద చెరువు
- రోజు రోజుకు ఆక్రమణలు, కబ్జాలు

సుల్తానాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పెద్ద చెరువు అభివృద్ధిపై దశాబ్దాల నుంచి నీలి నీడలు కమ్ముకున్నాయి. పాలకులు మారుతున్నా పెద్ద చెరువు అభివృద్ధి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో చెరువు అభివృద్ధికి నోచుకోకుండా పోయింది. రెండు దశాబ్దాల క్రితం అప్పట్టి ఎమ్మెల్యే స్వర్గీయ గీట్ల ముకుందరెడ్డి సుల్తానాబాద్ చెరువు అభివృద్ధిపై కదలిక తెచ్చారు. చెరువు కట్టను వెడల్పు చేయడం వంటి పనులు చేయించారు. వర్షాలకు మళ్లీ మట్టి కొట్టుకుపోయింది. శాశ్వతంగా చెరువు కట్ట నుంచి బీటీ రోడ్డు వేయించడానికి ప్రతిపాదనలు వచ్చాయి. చెరువు మత్తడి సమీపంలో బ్రిడ్జి మంజూరు చేయించారు. అయితే సాంకేతిక తప్పిదం వల్ల హన్మండ్లపల్లె గ్రామానికి బదులు హన్నంతునిపేటగా పేరు రావడంతో వంతెన పనులు ఆలస్యంగా చేపట్టి పూర్తి చేశారు. చెరువు మత్తడి ప్రాంతంతో పాటు పూసాల ర్యాకల్‌దేవ్‌పల్లి బీటీ రోడ్డు ఆనుకున్న చెరువు శిఖం భూములను ఆక్రమించుకున్నారని, యేటా కొందరు శిఖం భూముల పై


సుల్తానాబాద్ పెద్ద చెరువు

కన్నేసి చెరువులో నీళ్ల తగ్గుముఖం పట్టిన సందర్భాలలో మట్టి కుప్పలు పోసి ఎత్తు చేసి చెరువు నీటిని అడ్డుకుంటున్నారు. మట్టి పోసిన స్థలాలను అక్రమించుకుని అక్రమంగా నిర్మాణాలు చేశారు. మత్తడులు చెరువు శిఖం భూములను ఆక్రమించుకున్న పెద్ద వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. పైగా ఎలాంటి విచారణలు జరపకుండా ఇంటి నిర్మాణాలకు నంబర్లు కూడా కేటాయిస్తున్నారు. రాజీవ్ రహదారిని ఆనుకుని చెరువు ఉండడంతో బతుకమ్మ తల్లి విగ్రహం సమీపంలో చెరువును ఆనుకుని నిర్మాణాలు చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆక్రమణల మూలంగా సుల్తానాబాద్ చెరువు కళ తప్పింది. కట్ట ప్రారంభంలో ఎంతో విశాలంగా ఉండేది. ప్రస్తుతం ఇది తమదంటూ కట్టను ఆనుకుని గోడలు కట్టారు.

కలగా మిగిలిన మినీ ట్యాంక్ బండ్


అభివృద్ధికి నోచుకోని చెరువు కట్ట

సుల్తానాబాద్ పెద్ద చెరువును మినీ ట్యాంకు బండ్‌గా మారుస్తామని నేతలు అనేక సందర్భాలలో హామీలు ఇచ్చారు. వారు పదవులు దక్కించుకున్న తర్వాత చెరువు అభివృద్ధి మరచిపోతున్నారు. సుల్తానాబాద్, గుడిమిట్టపల్లి, హన్మాండ్లపల్లి, కందునూరిపల్లి, సుగ్లాంపల్లి, శ్రీరాములపల్లి తదితర గ్రామాల రైతుల ఆయకట్టు ఈ చెరువు మత్తడి మీదుగా వచ్చే సాగునీటితో ఆధారపడి ఉంది. సుల్తానాబాద్ మున్సిపాలిటీగా మారి ఆరు సంవత్సరాలు దాటింది. పట్టణ ప్రజల ఆహ్లాదానికి ఇక్కడ ఎలాంటి ఏర్పాట్లు లేవు. చెరువు కట్టను అభివృద్ధి చేసి మినీ ట్యాంకుబండ్ లాగా తీర్చిదిద్దుతామని హామీలు ఇచ్చారు. సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు ఎలాంటి ఆహ్లాదకరమైన పార్కులు స్థలాలు లేకుండా పోయాయి. ఇప్పటికైనా పాలకులు సుల్తానాబాద్ చెరువును అభివృద్ధి చేసి మినీ ట్యాంక్‌బండ్ గా మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రేమించి మోసం చేశాడని.. యువతి ఆత్మహత్యాయత్నం

హుజూరాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ప్రేమించి మోసం చేశాడని యువతి అతని ఇంటి ముందు పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా పెగడపల్లికి చెందిన యువతి హుజూరాబాద్‌కు చెందిన వినోద్ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఇరువురు ప్రేమించుకున్నారు. ఇటీవల వినోద్ వేరే అమ్మాయిని వివాహం చేసుకుంటున్నాడని తెలుసుకున్న యువతి హుజూరాబాద్‌కు వచ్చింది. ఈ విషయంపై వినోద్‌ను నిలదీయగా, నాకు సంబంధం లేదంటూ వెళ్లిపోయాడు. దీంతో మనస్థాపానికి గురైన యువతివెంట తెచ్చుకున్న పురుగులమందు తాగింది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



తీవ్ర గాయాలపాలైన మొండయ్య గౌడ్

ధర్మారం, అక్టోబరు 12 (ఆంధ్ర జ్యోతి): తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన ఘటన కటికెనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అనపురం మొండయ్యగౌడ్ కొన్ని సంవత్సరాలుగా గీతవృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం సాయంత్రం కల్లు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుండి జారిపడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్సనిమిత్తంకరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తలకు తీవ్రగాయం కావడంతో ఆసుపత్రిసిబ్బంది మెరుగైనవైద్యంకోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు. దీంతో కరీంనగర్‌లోని ఓప్రవేటు ఆసుపత్రిలోచేర్చి చికిత్సఅందిస్తున్నట్లు మొండయ్యకుమారుడు మహేష్ తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

వీణవంక, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామంలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడామంత్రిత్వ శాఖ మైభారత్ ఆధ్వర్యంలో బ్లాక్‌లెవల్ కబడ్డీ, వాలీబాల్ పోటీలను జిల్లా అధికారి వెంకటరాంబాబు ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో యువచైతన్య ఫ్రెండ్స్ యూత్‌క్లబ్ సభ్యులు కర్రె నాని, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి, తిరుపతి, సమ్మయ్య, సురేష్, గోపి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు మోక్షమెప్పుడో?

- 1972లో నాగులపేట దగ్గర అరుదైన సైఫన్ నిర్మాణం
- ఇంజనీర్ రామకృష్ణం రాజు అద్భుత ప్రతిభ
- పై నుంచి వాగు నీరు.. కింది నుంచి శ్రీరాంసాగర్ నీరు
- పర్యాటక కేంద్రంపై అమలుకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీ



సైఫన్ వద్ద బయటకు వస్తున్న నీరు

కోరుట్లరూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం నాగులపేట వద్ద నిర్మించిన సైఫన్‌ను ఎప్పుడు పర్యాటక కేంద్రంగా మారుసారోనని పర్యాటకులు ఎదురు చూస్తున్నారు. 1972లో ఈ సైఫన్‌ను రామకృష్ణంరాజు అనే ఇంజనీర్



సైఫన్ వద్ద మాయమవుతున్న నీరు

డిజైన్ చేసి నిర్మించారు. రెండు సంవత్సరాల పాటు వెయ్యి మంది కూలీలతో రాత్రింబవళ్లు ఈ కట్టడా న్ని నిర్మించడంలో రామకృష్ణంరాజు ప్రధాన పాత్ర పోషించారు. పైనుంచి వాగు, కింది నుంచి కాకతీయ కాలువ సుమారు 200 మీటర్ల పొడవున నిర్మించారు. ఇలాంటి కట్టడం ఆసియాలోనే రెండోదిగా ప్రసిద్ధి గాంచింది. దీంతో పర్యాటకులు, విద్యార్థిని, విద్యార్థులు కాకతీయ కాలువ పారే సమయంలో సందర్శనకు వస్తుంటారు.

సైఫన్ వద్ద ఇంజనీర్ విగ్రహం



ఇంజనీర్ రామకృష్ణంరాజు విగ్రహం

అద్భుత కట్టడాన్ని నిర్మించిన రామకృష్ణం రాజు నిర్మాణ సమయం లోనే మరణించడంతో స్మృతికి చిహ్నంగా ఆయన విగ్రహాన్ని ప్రాజెక్టు అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మాత్రం పర్యాటక కేంద్రంగా గుర్తించినప్పటికీ ఏవిధమైన సౌకర్యాలు కల్పించలేదు. కోరుట్ల పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో నాగులపేట గ్రామం ఉంది. గ్రామ శివారులో కాకతీయ కాలువ మీది నుంచి వాగు ప్రవహిస్తుంది. గ్రామస్థుల సహకారంతో గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో సైఫన్ వద్ద పిక్నిక్‌కు వచ్చే వారి కోసం పార్కును ఏర్పాటు చేశారు. సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా మార్చేందుకు అప్పటి నుంచి ఇప్పటి వరకు రాజ కీయ నాయకులు ఇస్తున్న వాగ్దానాలు వాగ్దానా లుగానే మిగిలిపోయాయి. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపి సైఫన్ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రం ఏర్పాటుకు కృషి చేయాలి

-మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్



కోరుట్ల మండల నాగులపేట గ్రామంలో కాకతీయ ప్రధాన కాలువపై నిర్మాణం చేసిన సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా అబివృద్ధి చేయాలి. ఈ ప్రాంతానికి వచ్చే పర్యాటకులకు ఆహ్లాదాన్ని నింపాలి.

ప్రభుత్వాలు చొరవ చూపాలి

-భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, నాగులపేట



నాగులపేట గ్రామ శివారులో ఉన్న సైఫన్‌ను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలి. ప్రతి ఎన్నికలకు మందు పోటీ చేసే ఎమ్మెల్యే, ఎంపీలు పర్యాటక కేంద్రంపై హామీ ఇచ్చి విస్మరిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

రామగిరి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్లలో బాకం రాంమూర్తి ఇంట్లో చోరీ జరిగినట్లు బాధితుడు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల7న ఇంటి తాళం వేసి పెద్దపల్లికి వెళ్లారు. ఆదివారం తండ్రి రాజయ్య ఇంటికి వచ్చి చూసేసరికి తలుపుతెరిచి ఉండటంతో ఇంట్లోకి వెళ్ళి చూడగా గుర్తుతెలియని వ్యక్తులు బీరువా పగులగొట్టి అందులో దాదాపు 4తులాల, బంగారం రూ.96 వేలు దొంగించినట్లుగా గుర్తించారు. ఈమేరకు రాంమూర్తి ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసుకొని పోలీసు దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

జమ్మికుంట రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన సెల్‌ఫోన్లను పోలీసులు ఆదివారం బాధితులకు అందజేశారు. జమ్మికుంటకు చెందిన ముక్క వేణు, వావిలాలకు చెందిన తూర్పాటి వెంకటేష్, మోత్కులగూడెంకు చెందిన దుర్గం తిరుమల సెల్‌ఫోన్లు వివిధప్రాంతాల్లో చోరీకి గురయ్యాయి. ఐఎమ్ఈఐ నంబర్ ఆధారంగా దొంగలను పట్టుకొని, వారినుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు పట్టణసీఐ ఎస్ తెలిపారు.

నుస్తులాపూర్‌లో డ్రంకెన్‌డ్రైవ్

తిమ్మాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్‌లో ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం డ్రంకెన్ డ్రైవ్ చేపట్టారు. ఈ డ్రైవ్‌లో నలుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ దొరికినట్లు ఎస్సై తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఆటోను ఢీకొట్టిన కారు

- ముగ్గురికి గాయాలు



గాయపడ్డ ప్రయాణికులు



బోల్తా పడిన ఆటో

తిమ్మాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ముందుగా వెళుతున్న ఆటోను వెనుకల నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి అందులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన తిమ్మాపూర్ మండలకేంద్రంలో ఆర్టీఏ కార్యాలయ సమీపంలో రాజీవ్‌రహదారిపై ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వైపు నుంచి రామకృష్ణాకాలనీవైపు వెలుతున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొంది. దీంతో ఆటో రోడ్డుపై నుంచి కిందికి దూసుకుపోయి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాజు, లక్ష్మి, మరొకరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎల్ఎండీ పోలీసులు తెలిపారు.

వాగు ప్రవాహంలో కొట్టుకుపోయిన యువకుడు

- రక్షించిన స్థానిక యువకులు

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్యఉన్న మానేరువాగు లో-లెవల్ కల్వర్టు పైనుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న మండల కేంద్రానికి చెందినకాసర్ల స్వామి వరద ప్రవాహానికి ఆదివారం రాత్రి కొట్టుకుపోయాడు. కాపాడండీ అంటూ కేకలు వేయడంతో అక్కడే ఉన్న పదిర గ్రామ యువకులు సహాయక చర్యలు చేపట్టారు. యువకుడిని, వాహనాన్ని అతికష్టం మీద బయటకు తీసుకువచ్చారు. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేటకు చెందిన స్వామి తన భార్య పిల్లలతో కలిసి బైక్‌పై సిరిసిల్ల మీదుగా తంగళ్లపల్లి మండలం రామన్నపల్లిలో తన అత్తగారింటికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో రామలక్ష్మణపల్లి, పదిర గ్రామాల మీదుగా స్వగ్రామానికి బయలుదేరాడు. మానేరువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడం గమనించని స్వామి వాహనంపై దాటే ప్రయత్నం చేశాడు. నీటి ఉధృతికి వాహనంతోపాటు కొట్టుకుపోయాడు. రక్షించండంటూ అరవడంతో యువకులు చేరుకుని కాపాడారు. సహాయక చర్యలు చేపడుతున్న క్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రేపాక రామచంద్రారెడ్డి స్వల్ప గాయాలపాలయ్యాడు. ఆయనను స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. స్వామిని కాపాడిన పదిర యువకులు రామచంద్రారెడ్డి, చెరుకు సాయి, కుమ్మరి సతీష్, శ్రీకాంత్, ఎలేందర్, అమరేందర్, కంచర్ల సతీష్, సాయిని పలువురు అభినందించారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్మకూర్ గ్రామానికి చెందిన వేముల మల్లయ్యకుచెందిన మేక ఆదివారం విద్యుదా ఘాతంతో మృతిచెందింది. మల్లయ్య గ్రామశివారులోని బద్దెమారికుంటకు మేకలమందను మేపడానికి తీసుకెళ్లాడు. అందులోని ఒకమేక నోటికి ప్రమాదవశాత్తు విద్యుత్‌వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మేకవిలువ రూ.10వేలు ఉంటుందని తెలిపాడు.

గ్రానైట్ క్వారీ ప్రమాదంలో కార్మికుడి మృతి

కరీంనగర్ క్రైమ్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం బావుపేటలోని గ్రానైట్ క్వారీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో రాజస్థాన్‌కు చెందిన కార్మికుడు సౌరబ్(20) మృతిచెందినట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు. బండను ట్రాలీలో లోడింగ్ చేస్తుండగా బండ పక్కకు పడడంతో, క్రేన్‌మధ్యలో ఇరుక్కున్న సౌరబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే తోటికార్మికులు సౌరబ్‌ను బయటకు తీసి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరళిస్తుండగా మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతుడి సోదరుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

విద్యుత్తు స్తంభంపై నుంచి పడి కార్మికుడి మృతి



గణేష్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ముంజాల గణేష్(20) అనే కాంట్రాక్ట్ కార్మికుడు విద్యుత్తు స్తంభంపై నుంచి కిందపడి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. ముంజాల గణేష్ అప్రెంటిస్‌షిప్‌లో భాగంగా హన్మకొండలోని ఓ ప్రైవేట్ విద్యుత్తుకాంట్రాక్టు వద్ద పని చేస్తున్నాడు. పనిలో భాగంగా విద్యుత్తుస్తంభం ఎక్కగా జారీ కింద పడగా కిడ్నీలు దెబ్బతిన్నాయి. చికిత్స నిమిత్తం గణేష్‌ను హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధ రాత్రి మృతిచెందాడు. గణేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ తాపీ మేస్త్రీ మృతి

ఎలిగేడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎలిగేడులో సుతారి పని చేస్తున్న జంద్రపల్లి యోహన్(43)అనే తాపీ మేస్త్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ రామచంద్రం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం డిపాటిపల్లి గ్రామానికి చెందిన యోహన్ పదేళ్లుగా ఎలిగేడులోని దేవండ్ల శివ అనే వ్యక్తి దగ్గర తాపీ మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈనెల 9న లలితపల్లిలో భవన నిర్మాణంలో భాగంగా మొదటి అంతస్తు పైన నిలబడి ప్లాస్టింగ్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి గాయాలపాలైన అతడిని చికిత్సకోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడని పేర్కొన్నారు. మృతుడి కూతురు సంపూర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వైద్యుడి మృతి

- ధర్మపురిలో విషాదం



జగదీష్ (ఫైల్)

ధర్మపురి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మపురి పట్టణానికి చెందిన కస్తూరి జగదీష్(35) అనే పిల్లల వైద్యుడు ఆదివారం ఉదయం మృతిచెందాడు. ధర్మపురి పట్టణానికి చెందిన కాంగ్రెస్‌నాయకుడు, జగిత్యాల పంచాయతీసమితి మాజీ కోఆప్షన్ మెంబర్ కస్తూరి రాంకిషన్ పెద్దకుమారుడు జగదీష్ హైదరాబాద్‌లో పిల్లల వైద్యుడిగా సేవలు అందిస్తున్నాడు. ఆదివారం ఉదయం ర్యాపిడో బుక్ చేసుకొని వాకింగ్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. బేగంపేట ఫ్లైఓవర్‌వద్ద ర్యాపిడోను వెనుకనుంచి లారీ ఢీకొట్టడంతో ర్యాపిడో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన జగదీష్‌ను యశోద ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జగదీష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. డాక్టర్ జగదీష్ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి ధర్మపురికి సాయంత్రం తీసుకువచ్చారు. మృతుడు జగదీష్ నిజామాబాద్ ఎంపీధర్మపురి అర్వింద్‌కు సమీపబంధువు కాగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అడవిశ్రీరాంపూర్‌లో యువకుడి ఆత్మహత్య



ఎడ్ల అజయ్(ఫైల్)

మంథని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామంలో ఎడ్ల అజయ్(25) అనేయువకుడు ఇంట్లో ఉరివేసుకొని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎడ్ల మల్లయ్య-సునీత దంపతులకు ఇద్దరు కుమారులు ఉండగా వారిలో పెద్ద కుమారుడు అజయ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారు. అజయ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈమేరకు పోలీసు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కుటీర పరిశ్రమలకు ఉచిత కరెంట్ ఇవ్వాలి

- విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం

కోరుట్ల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కుటీర పరిశ్రమలు నిర్వహించే విశ్వకర్మలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించాలని విశ్వకర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం అన్నారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని విశ్వకర్మ సంఘ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు శివుపల్లి రాజేశం పాల్గొన్నారు. ఈసందర్భంగా విశ్వకర్మ సంఘ నియోజకవర్గ ఇంచార్జుగా వెల్ది శ్రీకాంత్ చారీని ప్రకటించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు రాజేశం మాట్లాడుతూ కమ్మర, వడ్రంగి కులాలకు చెందిన వారు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా ప్రభుత్వం సంస్కరణలు తీసుకరావాలన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల వేణుగోపాల చారీ, జిల్లా ప్రదాన కార్యదర్శి కూనసపల్లి పడాల నరేష్, ఉపాధక్షులు పోన్నగంటి రంజిత్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎండిన చెట్లతో పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డుపై విరిగి పడ్డ చెట్టు కొమ్మలు

మానకొండూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చునూర్-ఊటూర్ గ్రామాల రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎండిన చెట్లతో ప్రమాదం పొంచి ఉంది. రెండు గ్రామాల మధ్య సుమారు కిలోమీటర్లు దూరం ఉంది. 30ఏళ్ల క్రితం రోడ్డుకిరువైపులా ఆర్‌అండ్‌బీ అధికారులు దురిసెన మొక్కలను నాటారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి వృక్షాలుగా తయారయ్యాయి. ప్రస్తుతం కొన్ని చెట్లు పూర్తిగా ఎండిపోయి కనిపిస్తున్నాయి. ప్రజలు వాటిని తీసుకెళ్లి వంట చెరుకుకు ఉపయోగించుకుంటున్నారు. కొన్ని ఏపుగా పెరిగి ఎండిపోయిన చెట్లు అలాగే ఉండిపోయి రోడ్డు మీద విరిగిపడుతున్నాయి. రెండు గ్రామాల ప్రజలు ఎండిపోయిన చెట్లను తొలగించాలని స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే ఎండిపోయిన చెట్లను తొలగించాలని సంబందిత అధికారులను ఆదేశించారు. అయితే ఇంతవరకు తొలగించలేదు.

మహిళ మెడలో నుంచి గొలుసు చోరీ

కథలాపూర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం తక్కళ్ళపల్లి-బొమ్మెన గ్రామాల మధ్య నాగెల్లి గంగు అనే మహిళ మెడలో నుంచి దొంగలు బంగారు గొలుసు ఎత్తుకెళ్ళారు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన నాగెలి గంగు అనే మహిళ తన తల్లి గారిల్లు బొమ్మెనలో జరిగిన ఓ శుభ కార్యానికి హాజరై బైక్‌పై తన భర్తతో కలిసి ఇంటికి వెళ్తోంది. తక్కళ్ళపల్లి శివారులో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు దొంగలు ఒక్కసారిగా మెడలోంచి రెండు తులాల బంగారు గొలుసును లాక్కెళ్ళారు. ఈ ఘటనపై పోలీసులు పలు గ్రామాల్లోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

కారు-ద్విచక్రవాహనం ఢీ

- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



శ్రీనివాస్(ఫైల్)

కోరుట్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల మండలం వేంకటాపూర్ - మోహన్‌రావుపేట గ్రామాల మధ్య రహదారిపై ఆది వారం కారు-ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఇల్లెందుల శ్రీనివాస్ (53) అనేవ్యక్తి మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు, స్థానికులు తెలిపారు. గుమ్లాపూర్ గ్రామానికి చెందిన ఇల్లెందుల శ్రీనివాస్, మేడిపల్లికి చెందిన సమీపబంధువు ఇల్లెందుల సాయికృష్ణ ద్విచక్రవాహనంపై మోహన్‌రావుపేట నుంచి వెంకటాపూర్ వైపు వస్తుండగా జగిత్యాలవైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. సంఘటనలో ఇల్లెందుల శ్రీనివాస్ మృతిచెందగా సాయికృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. సాయికృష్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

హత్యకేసు దర్యాప్తును పారదర్శకంగా జరపాలి



మాట్లాడుతున్న చిరంజీవి కుటుంబ సభ్యులు

వైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సెంటినరీకాలనీలో కోట చిరంజీవి హత్యకేసు దర్యాప్తును పోలీస్‌శాఖ నిష్పక్షపాతంగా జరపాలని మృతుడి కుంటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో చిరంజీవి కుటుంబీకులు మాట్లాడారు. పోతన కాలనీ మీసేవా నిర్వహిస్తున్న చిరంజీవి భార్య 2019లో మృతిచెందినట్టు తెలిపారు. 2021లో చిరంజీవి ఇంటర్మీడియట్ క్లాస్‌మేట్ అయిన సంధ్యారాణితో పరిచయం అయిందని, అది ప్రేమకు దారితీసినట్టు పేర్కొన్నారు. సంధ్యారాణిని నమ్మిన చిరంజీవి రూ.10లక్షలు, ఐదు తులాల బంగారం, కారు ఇచ్చినట్టు తెలిపారు. తనను పెళ్లి చేసుకోవాలని చిరంజీవిని సంధ్యారాణి వేధించేదని, ఈ విషయమై పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినట్టు తెలిపారు. ఇలా ఉండగా మాట్లాడుకుందామని చెప్పి చిరంజీవిని సెంటినరీకాలనీ ఐకేపీ సెంటర్‌కు రావాలని సంధ్యారాణి బంధువులు పిలవగా చిరంజీవి అక్కడకు వెళ్లాడన్నారు. పక్కా ప్రణాళికా ప్రకారమే ఆమె కుటుంబ సభ్యులు చిరంజీవిని హత్యచేశారని ఆరోపించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించకుండా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి హత్యచేసిన వారికి శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వంతెన రక్షణ గోడను ఢీకొట్టిన లారీ



ధ్వంసం అయిన వంతెన రక్షణగోడ

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ -జగిత్యాల మార్గంలోని నూకపల్లి స్టేజిసమీపంలో గల వరద కాలువ వంతెన రక్షణగోడకు లారీ ఢీకొంది. వంతెన మొదట్లో ప్రమాదకర గుంత ఉండడం, ఎదురుగా వస్తున్న వాహనంను తప్పించే యత్నంలో లారీ వంతెన రక్షణగోడను ఢీకొనడంతో కొంతభాగం కూలిపోయింది. ఇరిగేషన్ సిబ్బంది ఘటనాస్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వంతెన రక్షణ గోడను ఢీకొనడంతో లారీ ముందు భాగం ధ్వంసం అయింది.

పిల్లలు పుట్టడం లేదని ఒకరి ఆత్మహత్య



శంకర్(ఫైల్)

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లలో సంతానం కలగడం లేదని మద్యానికి బానిసై శనివారం అర్ధరాత్రి ఉప్పు శంకర్(43) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శంకర్‌కు ఆరు సంవత్సరాల క్రితం వివాహం కాగా సంతానం కలుగలేదు. ఈ క్రమంలో మద్యానికి బానిసైన శంకర్ శనివారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రస్మా రాష్ట్ర కన్వీనర్‌గా సొగాని కొమురయ్య


సొగాని కొమురయ్య

కరీంనగర్ టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) రాష్ట్ర కన్వీనర్‌గా కరీంనగర్ వివేకానంద విద్యాసంస్థల అధినేత సొగాని కొమురయ్య నియమితులయ్యారు. కరీంనగర్‌లో జరిగిన ట్రస్మా రాష్ట్రకార్యవర్గ సమావేశానంతరం ట్రస్మారాష్ట్ర కన్వీనర్, కో ఆర్డినేటర్‌తోపాటు కరీంనగర్, నిజామాబాద్, నిర్మల్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శి, కోశాధికారులను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎస్ మధుసూదన్, ఎస్ రమేశ్‌రావు ఒక ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా వివేకానంద విద్యాసంస్థల అధినేత సొగాని కొమురయ్యను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా బుచ్చిరెడ్డి, కోశాధి కారిగా నగేశ్‌రెడ్డి నియమితులయ్యారు. నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా పోలపల్లి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా క్రాంతి, నిర్మల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, అరవింద్ రెడ్డి, కోశాధికారిగా ఎం.మల్లేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎ.బాబురావు, ఎ.రాఘవేందర్‌రెడ్డి, ఎం.రాజును నియమించినట్లు ప్రకటించారు.



రాజన్న దర్శనాలు ఉంటాయా.. ఉండవా..

● పొంతనలేని ప్రకటనలతో గందరగోళం..

వేములవాడ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దర్శనాలు ఉంటాయా..? ఉండవా..? అనే విషయంలో గందరగోళం నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులను చేపడుతోంది. భీమేశ్వర ఆలయంలో భక్తులకు దర్శనాలు, కోడెమొక్కులతోపాటు ఆర్జిత సేవలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం నుంచి రాజన్న ఆలయంలో భక్తులకు దర్శనాలు నిలిపి వేస్తారనే ప్రకటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆలయం మూసివేత ఉండదని, స్వామివారికి ఏకాంత పూజలు, నిత్య కైంకర్యాలు ఎప్పటిలాగే కొనసాగుతాయని మరో ప్రకటన వైరల్ అయ్యింది.

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కామెంట్స్

రాజన్న ఆలయంలో దర్శనాలపై స్పందించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కార్యకర్తలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న మొక్కులను భక్తులు భీమన్నకు ఎట్లా చెల్లిస్తారని, భక్తుల మనోభావాలకు భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకోబోమంటూ హెచ్చరించారు.

● యథావిధిగా దర్శనాలు

రాజన్న ఆలయంలో దర్శనాలపై వైరల్ అయిన ప్రకటలతో భక్తులు ఆందోళన చెందారు. ఆదివారం దర్శనాలు యథావిధిగా కొనసాగాయి. ప్రస్తుతం దర్శనాలు కొనసాగుతున్నప్పటికి ఎప్పటివరకు కొనసాగుతాయనే దానిపై స్పష్టత లేదు.

ఆలయం ఎదుట ధర్నా, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు దర్శనాలను నిలిపివేస్తే చూస్తూ ఊరుకోబోమని బీజేపీ నాయకులు మండిపడ్డారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం రాజన్న ఆలయం ఎదుట ధర్నా చేసి రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అర్బన్ మండలంలో నందికమాన్ వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. విషయం తెలుసుకున్న ఈవో రమాదేవి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ రాజన్న ఆలయంలో దర్శనాలు కొనసాగుతున్నాయని, దర్శనాలను


దిష్టి బొమ్మ దహనం చేసి రాజన్న ఆలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

నిలిపివేయలేదన్నారు. అభివృద్ధిలో భాగంగా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.దీంతో ధర్నాను విరమించారు.

రాజన్న భక్తుల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి పనులు

● అందరి సూచనలు తీసుకుంటాం
● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


విలేకరులతో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ రాజన్న భక్తుల విశ్వాసానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న ఆలయ గెస్ట్‌హౌస్‌లో సీఎం ఓఎస్డీ శ్రీనివాసులు, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి. గీతేతో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఆలయ విస్తరణ సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో ఆర్జిత సేవలు ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు, కేంద్ర మంత్రి బండి సంజయ్, ఇతరుల సూచనలు, సలహాలు ఇదివరకు తీసుకున్నామన్నారు. ఆలయ పిల్లర్ల కోసం లోతుగా గుంతలు తియ్యాల్సి వస్తుందని, పెద్ద యంత్రాలు వస్తాయని తెలిపారు. పనులు జరుగుతున్న సమయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమన్న ఆలయంలో ఆర్జిత సేవలకు ఏర్పాట్లు చేశామన్నారు. 19, 20 తేదీల్లో శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి స్వామి వస్తారని, ఆయన సలహాలు, సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి సూచనల మేరకే భీమేశ్వర ఆలయంలో దర్శనాలు ఏర్పాటు చేశామన్నారు. ఆలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్వామివారికి నిత్యం నిర్వహించే కైంకర్యాలు కొనసాగుతాయని తెలిపారు. ఆయన వెంట రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి ఉన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్యం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి


సిరిసిల్లలో మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీఎమ్మెల్యే సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడవెంకట్‌రెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లోని కార్మికభవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌లను అమలు చేయాలని రాష్ట్రప్రభుత్వం కోరుతున్నా కేంద్రప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతివార్డు స్థానం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు సీపీఐ నాయకులు బరిలో ఉండి గెలుపొందడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బీసీ రిజరేషన్ బిల్లును అమలు చేయడంతోపాటు రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. వేములవాడలో ఈనెల26న గుమ్మి పుల్లయ్యభవన్‌లో ఏఐటీయూసీ జిల్లా నాలుగో మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్, ఏఐటీ యూసీ జిల్లాకార్యదర్శి కడారి రాములు, అధ్యక్షుడు అజ్జవేణు, కేవీ అనసూర్య, గాజుల రాధ, రవి, అంగూరి రంజిత్, అనవేణి భూదన్న తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కాలువకు నీటి విడుదల

జగిత్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు ఆదివారం 5వేల క్యూసెక్కుల నీటినివిడుదల చేస్తున్నారు.ఎగువ ప్రాంతం నుంచి 6,790 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకుగాను ప్రస్తుతం 80.053టీఎంసీల నీరునిల్వ ఉంది. ఇందులో సరస్వతీ కాలువకు 650క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200క్యూసెక్కులు విడుదల అవుతోంది.


శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

వారసంతల్లో కనీస వసతులు ఎరువు

● కమ్యూనిటీ మరుగుదొడ్ల లేక ఇబ్బందులు

రామడుగు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న వారసంతల్లో కనీసవసతులు కరువ వడంతో చిరువ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా రామడుగు మండలకేంద్రంలో కరీంనగర్-గోపాల్‌రావుపేట ప్రధాన రహదారిపై సంత నిర్వహిస్తున్నారు. అలాగే గోపాల్ రావుపేటలో సైతం వ్యవసాయ భూమికి వెళ్లే ప్రధాన రహదారిపై సంతను నిర్వహిస్తున్నారు. అలాగే షానగర్ వద్ద కూడా వారసంత నిర్వహిస్తుండగా ఎక్కడ కూడా కనీస వసతులు లేవని వ్యాపారులు, వినియోగదారులు వాపోతున్నారు. ప్రధానంగా కమ్యూనిటీ మరుగుదొడ్లు లేకపోడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఇకనైనా స్పందించి


రామడుగులో రోడ్డుపైనే నిర్వహిస్తున్న వారసంత

వారసంతల్లో కనీస మౌలిక వసతులు కల్పించాలని వినియోగదారులు, వ్యాపారులు కోరుతున్నారు.

శబరిమలలో బంగారం చోరీపై కేంద్రం జోక్యం చేసుకోవాలి

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : శబరిమల శ్రీధర్మశాస్తా దేవాలయంలో బంగారం చరీ, ఆస్తుల దుర్వినియోగంపై ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు నిబంధనల ఉల్లఘనపై తీవ్ర ఆరోపణలు వెలువడిన నేపథ్యంలో కేంద్రప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. కరీంనగర్ అయ్యప్ప సేవాసమితి సభ్యులు ఆదివారం ఓ కార్యక్ర మానికి భగత్‌నగర్ అయ్యప్ప ఆలయానికి వచ్చిన కేంద్ర మంత్రిని కలిశారు. కఠిన దీక్షతో, నియమాలతో, భక్తితో అయ్యప్ప ఆలయానికి వెళుతా రని, అంతటి విశిష్టత కల ఆలయంలో ఆభర ణాలు చోరీ కావడం, తప్పుడు రికార్డులు నమోదు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా చేయడం క్షమించరాని నేరమని తెలిపారు. 1999లో ఆలయంలో ఉపయోగించిన 1.5కిలోల బంగారాన్ని రాగిగా రికార్డుచేసి ఉద్దేశ్య పూర్వకంగా దాచిపెట్టారని ఆరోపించారు. బంగారు కవచాన్ని ప్రత్యేక కమిషన్‌కు సమాచారం ఇవ్వ కుండానే ప్రైవేట్ సంస్థకు తరలించి కస్టోడియల్ ప్రొటోకాల్ ఉల్లఘనకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ విషయం వెలుగులోకి రావడం హైకోర్టు ఆదేశాలపై ఏర్పడిన సిట్ విచారణ తర్వాత మాత్రమే జరిగిందని గుర్తుచేశారు. తక్షణమే శబరిమల ఆలయ ఆస్తులపై సీబీఐ పర్యవేక్షణలో ఆడిట్ లేదా సెంట్రల్ హెరిటేజ్ ఆస్తులపై సమీక్ష జరుపాలని డిమాండ్ చేశారు. ఆస్తులను డిజిటల్ పబ్లిక్ ఇన్వెంటరీ సిస్టం ద్వారా నిర్వహిస్తూ కంట్రోలర్ ఆడిట్ జనరల్ నిర్దేశించిన ప్రమాణాలను పాటించేలా చూడాలని తెలిపారు. బాధ్యు లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆల యానికి కేంద్ర


కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సాంస్కృతిక వారసత్వరక్షణ హోదా కల్పించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కె పరమేశ్వర్, పి సత్యనా రాయణ, జి నాగరాజు, పి సాయన్న తదత రులున్నారు.

23న కొండగట్టులో తలనీలాలకు వేలం

మల్యాల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తుల నుంచి గత ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు, 2023 ఏప్రిల్ 12 నుంచి జూలై వరకు దేవస్థానం ద్వారా సేకరించి పోగుచేసి నిల్వఉంచిన తలనీలాలకు ఈనెల 23న టెండర్లు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ-టెండర్, సీల్డ్ టెండర్‌కం బహిరంగ వేలం నిర్వహంచడం జరుగుతుందని తెలిపారు. మరిన్ని వివరాలకోసం 8333800721, 8333800723లో సంప్రదించాలని అన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఆదివారం ఉదయం భక్తులు పెద్ద సంఖ్యలో రాజన్న ఆలయానికి తరలివచ్చారు. రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్‌లో బారులు తీరారు. అనంతరం పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు.

రాజన్నసేవలో సీఎం ఓఎస్‌డీ శ్రీనివాస్..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని సీఎం ఓఎస్‌డీ వేములశ్రీనివాస్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆయనకు స్వస్తివచనంతో స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఏఈవో రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

జాతీయస్థాయి యోగా పోటీల్లో కాంస్య పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని మైసూరులో ఈ నెల 9 నుంచి 12వరకు నిర్వహించిన 50వ జాతీయస్థాయి సీనియర్ యోగాసన పోటీలలో జిల్లాకు చెందిన పొన్నపాటి అరుణకుమారి కాంస్య పతకం సాధించారు. ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారుపతకం సాధించిన అరుణకుమారి తెలంగాణ రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహించి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యోగా సంఘం చైర్మెన్ సర్దార్ రవీందర్‌సింగ్ అరుణకుమారిని అభినందించారు.

జాతీయ పోటీలలో కాంస్యపతకం సాధించిన ఆమె క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలిచిందని కొనియాడారు. అరుణ కుమారిని రాష్ట్ర యోగా సంఘం ఇంచార్జి ప్రధానకార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి, వర్కింగ్


జాతీయ యోగా పోటీల్లో కాంస్య పతకం, ప్రశంసా పత్రం అందుకుంటున్న అరుణకుమారి

ప్రెసిడెంట్ ఎస్ఎన్ రెడ్డి, వివిధ జిల్లాల యోగా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అభినందిం చారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి

● ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త చాగంటి కోటేశ్వర్‌రావు

ధర్మపురి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వర్‌రావు అన్నారు. జగిత్యాలజిల్లా ధర్మపురి పుణ్యక్షేత్రంలోని శ్రీమఠం స్థలంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన ముగింపు కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మపురి గొప్ప పుణ్య క్షేత్రమని పేర్కొన్నారు. ఈ క్షేత్రంలో నిత్య నారసింహ హోమం, కుజదోష నివారణ పూజలు నిర్వహించడం వల్ల అనేకమంది దోషాలు తొలగి


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు

పోతున్నట్లు ఆయన అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఆధ్యాత్మికత మన జీవితానికి దిశానిర్దేశం చేస్తుందని తెలిపారు. రాష్ట్రఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చాగంటి కోటేశ్వర్‌రావు తన ప్రవచనాల ద్వారా ధర్మపురిక్షేత్రాన్ని ప్రపంచానికి తెలియజేశారని అన్నారు. చాగంటి కోటేశ్వర్‌రావు ప్రవచనాలు విని ప్రతిఒక్కరు భక్తిమార్గంలో పయనించాలని సూచించారు. అనంతరం మంత్రి లక్ష్మణ్‌కుమార్ కొడుకు హరీశ్వర్ కుమార్ రూపొందించిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి డాక్యుమెంటరీ ప్రోమోను చాగంటి కోటేశ్వర్‌రావు ఆవిష్కరించారు. అనంతరం చాగంటి కోటేశ్వర్‌రావు, మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ సత్యప్రసాద్, మాజీమంత్రి జీవన్‌రెడ్డి, ఎస్పీ అశోక్‌కుమార్‌లను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పురాణ ప్రవచకులు బాచంపెల్లి సంతోష్ కుమార్ శర్మ, ఆలయ ధర్మకర్తల మండలిచైర్మన్ జక్కు రవీందర్, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్ టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండలకాంగ్రెస్ అధ్యక్షుడు సంగన భట్ల దినేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ ఏరుకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. జగిత్యాల డీఎస్పీ వెంకటరమణ పర్యవేక్షణలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

వైద్యరంగంలో ఏఐది కీలకపాత్ర

● ఫిజీషియన్ల రాష్ట్ర సదస్సులో వైద్య నిపుణులు

సుభాష్‌నగర్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ముఖ్యపాత్ర పోషిస్తుందని ప్రముఖ వైద్యనిపుణులు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం తెలంగాణ ఫిజీషియన్ల 9వ రాష్ట్ర సదస్సు వీ కన్వెన్షన్‌లో ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖవైద్యులు మాట్లాడారు. రానున్న రోజుల్లో వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ముఖ్యభూమిక పోషిస్తుందన్నారు. డాక్టర్‌కు పేషెంట్‌తో ఎక్కువ సమయం కేటాయించవచ్చన్నారు. జిల్లా కేంద్రానికిచెందిన సీనియర్ ఫిజీషియన్లు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ విఠల్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. రెండు రోజుల పాటు ఆర్గనైజింగ్ చైర్మెన్ డాక్టర్ వి తిరుపతి రావు, కార్యదర్శి డాక్టర్ విజయ్ మోహన్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ చైతన్య, డాక్టర్ రఘురామన్, డాక్టర్ సురేష్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ప్రశాంతి ఆధ్వర్యంలో రాష్ట్రసదస్సు నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి ఫిజీషియన్ వైద్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.


వేదికపై కూర్చున్న సీనియర్ ఫిజీషియన్లు

● ఊబకాయానికి మందు ఉంది
- డాక్టర్ రాకేశ్ సహాయ్, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్



కొన్ని సంవత్సరాలుగా మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి మూలంగా చాలా చిన్న వయస్సులోనే ఊబకాయానికి గురవుతున్నారు. ఊబకాయం వల్ల సుమారు 200రకాల జబ్బులు వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిని అదుపు చేసేందుకు మందులు అందుబాటులోకి వచ్చాయి.

● రక్తహీనతను తేలికగా తీసుకోవద్దు
- డాక్టర్ గణేష్ జై షట్వార్, హైటెక్ సిటీ యశోద హాస్పిటల్



నేడు రక్తహీతన సాధారణమైంది. 10మంది యుక్తవయస్సు ఆడపిల్లల్లో 7నుంచి 8మందికి, 10మంది పురుషుల్లో ఇద్దరి నుంచి ముగ్గురికి, చిన్నపిల్లలు కూడా రక్తహీనతతో బాధపడుతున్నారు. రక్తహీనతను తేలికగా తీసుకోవద్దు. రక్తపరీక్షలు చేయించుకుని అందుకు అనుగుణంగా చికిత్స తీసుకోవాలి.

● మంచి బ్యాక్టీరియాతో రోగం నయం చేయవచ్చు
- డాక్టర్ రవిశంకర్, గ్యాస్ట్రో ఎంటరాలజిస్టు



మంచి బ్యాక్టీరియాతో రోగం నయం చేయవచ్చు. ఫీకల్ మైక్రో బయాలజీ టెస్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా ఆరోగ్యవంతంగా ఉన్నవ్యక్తి స్టూల్(మలం)ను తీసుకొని పేషంట్‌కు ట్రాన్స్‌ప్లాం టేషన్ చేయడం వల్ల పేషంట్‌లో మంచి బాక్టీరియా పెరుగుతుంది. దాంతో పేషంట్ త్వరగా కోలుకుంటాడు.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి చర్యలు

(5వ పేజీ తరువాయి)

కట్ట పైకి వచ్చి కూరగాయలు, మాంసం కొనుగోలు చేయటానికి అనుకూలంగా జాయింట్ రోడ్డులు అనుసంధానంగా ఉన్నట్లు పేర్కొన్నారు. మార్కెట్ తరలింపు కోసం వ్యాపారులు సహకరించాలని కోరుతున్నారు. వెజ్, నాన్ వెజ్ మార్కెట్ తరలింపు అనంతరం మార్కెట్‌లోని ఇతర చిరు వ్యాపారుల అడ్డాలు, ప్రధాన రహదారి పక్కనే ఉన్న షాపుల తొలగింపు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మార్కెట్ తరలింపుపై వ్యాపారుల నుంచి భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి వేగంగా చర్యలు తీసుకుంటున్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కరాటే ఆత్మరక్షణ కోసం ఎంతో ఉపయోగపడుతుందని మండల విద్యాధికారి జింక మల్లేషం అన్నారు. ఆదివారం గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే ఎంపిక పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. కరాటేతో ఆత్మరక్షణతోపాటు శరీర దారుఢ్యం, మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. ప్రభుత్వం పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ కరాటే శిక్షణ ఇప్పిస్తుందన్నారు. ఎస్‌జీఎఫ్ కరాటే పోటీల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని జిల్లాకు పతకాలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కనుకుంట్ల లక్ష్మణ్, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, శోభ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా సెక్రటరీ తగరపు శంకర్, రచ్చ శ్రీనివాస్, కరాటే శ్రీనివాస్, రాజ్‌కుమార్, శంకర్, సురభి అన్వేష్, జావిద్ కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లా జిల్లాల కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు.



కరాటే ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో మల్లేషం





ఖనిలో ర్యాలీ నిర్వహిస్తున్న స్వయం సేవకులు, మంథని సమావేశంలో పాల్గొన్న స్వయం సేవకులు

ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే



ఓటు వేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) స్థానిక అమర్ చంద్ కల్యాణ మండపంలో జరుగుతున్న పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్ ఎన్నికలలో ఆదివారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ మొత్తం 5 వందల పైచిలుకు సభ్యులున్న రిక్రియేషన్ క్లబ్‌లో ఆర్డీవో అధ్యక్షుడిగా ఉంటారని మిగితా కార్యవర్గానికి ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల అధికారులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కూడా ఓటు వేశారు. పెద్దపల్లి క్లబ్ సభ్యులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు... సంరక్షణ మరిచారు...



ఆర్‌టీసీ ఆవరణలో నాటిన మొక్కలు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ ఆవరణలో నాటిన మొక్కల సంరక్షణను మరిచిపోయారు. మొక్కల చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి ఎదుగుదల లేకుండా అవుతున్నా ఆర్‌టీసీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూన్‌లో గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్ సందర్శనకు వచ్చిన ఆర్‌టీసీ కరీంనగర్ రీజినల్ డైరెక్టర్ సాల్మాన్, రీజినల్ మేనేజర్ రాజు బస్టాండ్ ఆవరణలో మొక్కలను నాటారు. నాటి నుంచి నేటి వరకు ఆర్‌టీసీ సిబ్బంది మొక్కల సంరక్షణను పట్టించుకోకపోవడంతో వాటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగి చిత్తడిగా మారింది. ఇప్పటికైనా ఆర్‌టీసీ అధికారులు మొక్కల సంరక్షణకు శ్రద్ధ తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన



రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నేతలు

మంథని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ పై దాడిని ఖండిస్తూ, కుల వివక్ష కారణంగా ఐపీఎస్ అధికారి పూరన్‌కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో ఆదివారం నిరసన తెలిపారు. బహుజన సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు తగరం శంకర్‌లాల్ మాట్లాడుతూ.. దేశంలో అత్యున్నత స్థాయిల్లో ఉన్న వారు సైతం కుల వివక్షతకు గురికావడం దారుణమన్నారు. ఈ రెండు సంఘటనలను అందరూ ఖండించాలని కోరారు. తెలంగాణలో బీసీ వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ఈనెల 14న బీసీ సంఘాలు ఇచ్చిన బందుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నేతలు ఆరెపల్లి కుమార్, వేల్పుల గట్టయ్య, దేవళ్ల విజయ్‌కుమార్, పీక మల్లేశం, రాదండి శంకర్, లింగయ్య, రవి, తిరుపతి, శ్రీకాంత్, ధర్మేందర్, శ్రావణ్, రాజపోషంలు పాల్గొన్నారు.

పట్టుదలతో ఏదైనా సాధించవచ్చు

ఓదెల, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మనిషికి పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లికి చెందిన పిట్టల పవన్ కుమార్ గ్రూప్ 2లో ఎంపీఓ ఉద్యోగానికి సెలెక్ట్ అయ్యారు. ఆయనకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడి చదివిన పవన్ కుమార్ పట్టుదలతో ఉన్నతమైన బాధ్యతలను చేపట్టాలని ఆకాంక్షించారు. మాజీ వైస్‌ఎంపీపీ పిట్టల రవి కుమార్, గ్రామ నాయకులు కందుల రమేష్, యాదగిరి సమ్మయ్య, వేల్పుల కృష్ణస్వామి, పిట్టల సాగర్, ఓదెల మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్ పాల్గొన్నారు.



విజేతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కెమిస్ట్రీ అండ్ డ్రగిస్ట్ కార్యవర్గం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి)జిల్లా కెమిస్ట్రీ అండ్ డ్రగిస్ట్ జిల్లా కార్యవర్గం స్థానిక ఆర్‌ఆర్ గార్డెన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై నూతన కార్య వర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మెడికల్ షాపుల నిర్వాహకులు నకిలీ మందు విక్రయించరాదని, నిరుపేదలు వస్తే లాభాలు ఆశించకుండా అందజేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను కార్యవర్గం ఘనంగా సత్కరించారు.

జేఈగా ఎంపికైన యువకుడికి సన్మానం



సింగిరెడ్డి నవీన్‌ను సన్మానిస్తున్న సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆశన్నపల్లె గ్రామానికి చెందిన సింగిరెడ్డి నవీన్ జూనియర్ ఇంజనీర్‌గా ఎంపికయ్యారు. ఆర్‌ఆర్‌బీ ప్రకటించిన ఫలితాల్లో నవీన్ ఎంపిక కాగా మాజీ ఎంపీపీ గోపగాని సారయ్య గౌడ్ ఆయనను సన్మానించారు. సారయ్యగౌడ్‌తోపాటు మాజీ సర్పంచ్ మంద వెంకన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కదురు మల్లారెడ్డి, మంద రాజిరెడ్డి, ఎరుకల తిరుపతి, శ్రీకాంత్, రాజేందర్, హరికృష్ణ, అన్వేష్, అర్జున్ తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

నేత్రదానంపై అపోహలు వీడాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): అపోహలు వీడి నేత్ర దానానంపై అవగాహన పెంపొందించుకోవాలని సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. బండి మల్లయ్య ఇటీవల మరణించగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సోమవారం కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మల్లయ్య సంస్మరణ సభ జరిగింది. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి మల్లయ్య కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. నేత్రదానానికి అంగీకరించిన మల్లయ్య కుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రశంసాపత్రాన్ని అందజేసింది. బాలయ్య, వీరారెడ్డి, రవి, మహేందర్‌రెడ్డి, నల్లవెల్లి శంకర్ పాల్గొన్నారు.

మహిళ నేత్రాలు దానం

శనివారం అనారోగ్యంతో మరణించిన కేత సూర్యకుమారి నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు. మృతురాలి నేత్రాలు దానం చేస్తే ఇద్దరికి చూపు వస్తుందని సదాశయ ఫౌండేషన్ అవగాహన కల్పించడంతో మృతురాలి భర్త సత్యనారాయణ, కుమారులు ప్రభాకర్, శ్రీనివాస్, కుమార్తె పార్వతిలు నేత్రదానానికి అంగీకారం తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ నేత్రాలను సేకరించి ఐబ్యాంక్‌కు తరలించారు. కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు.

నేడు మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన

మంథని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంథనిలో సోమవారం పర్యటించనున్నారు. క్యాంపు ఆఫీసులో డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాలకు చెందిన సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు మంత్రి పంపిణీ చేయనున్నారు.

పోషకాహారం అందజేత

కోల్‌సిటీటౌన్, అక్టోర్ 12(ఆంధ్రజ్యోతి): నీడ సంస్థ దాత కరణ్ లావణ్య దంపతుల కుమార్తె కీర్తన జన్మదినం సందర్భంగా ఆదివారం గోదావరిఖని ఇందిరానగర్‌కు చెందిన నిరుపేద గర్భిణికి మూడు నెలల పోషకాహారాన్ని సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేష్ చేతుల మీదుగా అందజేశారు. ఆయన మాట్లడుతూ యూనియన్ బ్యాంక్ ఉద్యోగి కరణ్ తరుపున 12వ పేద గర్భిణీని పోషకాహారం అందించామని తెలిపారు. నీడ అధ్యక్షుడు అంగన్‌వాడీ టీచర్ శారద, సతీష్ పాల్గొన్నారు.

సుల్తాన్‌పూర్‌లో పిచ్చి కుక్కల వీరంగం

ఎలిగేడు, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): సుల్తాన్‌పూర్ గ్రామంలో పిచ్చికుక్కల స్వైరవిహారం చేస్తున్నాయి. నెల వ్యవధిలోనే 22 పశువులను పిచ్చి కుక్కలు కరిచాయి. అందులో ఎనిమిది పశువులకు రేబిస్ వ్యాపించి మృత్యువాత పడ్డాయి. రోజు రోజుకు పిచ్చి కుక్కల మూలంగా ఏమీ జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మృత్యువాత పడిన పశువుల్లో ఒక్కొక్కటి సుమారు రూ.60 వేల వరకు ఉంటుందని రైతులు పేర్కొన్నారు. కుక్కకాటుకు గురైన పశువులకు గ్రామంలో స్పెషల్ క్యాంపు ఏర్పాటు చేసి పశువైద్యాధికారి ఝాన్సీ పశుమిత్రలు సమ్మయ్య వైద్య సేవలు అందిస్తున్నారు. పిచ్చి కుక్కల నుంచి పశువులు, పిల్లలను ఎలా కాపాడుకోవాలని ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కూలిన కల్వర్టు సైడ్‌వాల్

- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్ మీ సేవా కేంద్రం సమీపంలో ఉన్న వంతెన సైడ్ వాల్ కూలిపోయి ఏళ్లు గడుస్తున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ రహదారిపై నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. తిలక్‌నగర్ నుంచి విఠల్‌నగర్ వైపు వెళ్లే రహదారిపై వంతెన కృంగిపోయి ప్రమాదకరంగా మారినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ రహదారి వెంట పాఠశాలకు వెళ్లే సింగరేణి కార్మికులతోపాటు సెంటినరీకాలనీ, కమాన్‌పూర్, బేగంపేట ప్రాంతాలకు రోజు వందలాది మంది ప్రయాణిస్తుంటారు. వంతెన ఇరువైపులా ఉన్న సైడ్‌వాల్ కూలిపోయి ప్రమాదంగా మారింది. రాత్రి వేళల్లో ఈ కల్వర్టును ఢీకొని అనేక మంది ద్విచక్ర వాహనదారులు గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ప్రమాదంగా మారిన కల్వర్టును ఇప్పటికైనా మరమ్మతులు నిర్వహించాలని కాలనీవాసులు కార్పొరేషన్ అధికారులను కోరుతున్నారు.



కూలిన కల్వర్టు సైడ్ వాల్

నాలుగు దశాబ్దాలుగా నగర సంకీర్తన

- సుల్తానాబాద్‌లో కార్తీక అఖండ జ్యోతియాత్ర
- సాంబశివ దేవాలయంలో ఆకాశ దీపోత్సవం
- అభిషేకాలు, ప్రత్యేక పూజలు



కార్తీక జ్యోతితో భక్తుల శోభాయాత్ర

సుల్తానాబాద్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసానికి పదిహేను రోజుల ముందు నుంచే సుల్తానాబాద్ పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయ ఆవరణలో ఉన్న సాంబశివ దేవాలయంలో కార్తీక అఖండ దీపోత్సవం అంగరంగ వైభవంగా జరుగుతోంది. నాలుగు రోజుల క్రితం కోజాగరి పౌర్ణమి రోజు నుంచి ఆలయంలో అఖండ జ్యోతి కార్యక్రమం ప్రారంభమై నెల రోజుల పాటు కొనసాగుతుంది. ఈ నెల ఏడు నుంచి ఈ కార్తీక దీపోత్సవాలు, అఖండ జ్యోతితో రోజు నగర సంకీర్తన కొనసాగుతుంది. నలభై సంవత్సరాల నుంచి కార్తీక జ్యోతి యాత్ర సుల్తానాబాద్ పట్టణంలో జరుగుతుంది. జ్యోతితో నగర సంకీర్తన కార్యక్రమం నవంబరు 10వ తేదీ వరకు కొనసాగుతుంది. నెల రోజులపాటు సాంబశివ ఆలయంలో రోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామి వారి అభిషేక పూజలు ప్రారంభమవుతాయి. ఐదు గంటలకు భక్తులందరితో కలిసి కార్తీక జ్యోతిని వెంట తీసు కుని వేణుగోపాలస్వామి ఆలయం నుంచి పాత జెండా మీదుగా పాత బజారులోని శివా లయం, హన్‌మాన్ ఆలయాలను సందర్శించి తిరిగి పోలీస్‌స్టేషన్ మీదుగా సాంబశివ ఆలయం చేరు తుంది. అఖండ జ్యోతి నగర సంకీర్తనలలో భాగంగా దారి పొడుగునా భక్తులు ఇండ్ల నుంచి జ్యోతికి స్వాగతం పలుకుతూ అఖండ జ్యోతిలో వత్తులు వేసుకుంటారు. దారి పొడుగునా భక్తి గీతాలు ఆలపిస్తూ భజనలు చేస్తారు.

నేడు శివుడి జన్మ నక్షత్రం

ఆశ్వీయుజ బహుళ సప్తమి సోమవారం రోజున ఆర్ద్ర నక్షత్రం వస్తుందని, ఇది శివుని జన్మ నక్షత్రం, సోమవారం కూడా కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ రోజు దీపోత్సవంలో కానీ అభిషేకంలో కానీ పాల్గొనే భక్తులకు విశేష ఫలితాలు గోచరిస్తాయని, పలు దోషాలు తొలగిపోతాయని పండితులు తెలిపారు.

కార్తీక పురాణ శ్రవణం

జ్యోతితో నగర సంకీర్తన అనంతరం ఆలయానికి చేరుకున్న భక్తులు పూజారి ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక పురాణ శ్రవణంలో పాల్గొని నెల రోజుల పాటు రోజుకొక కథ చొప్పున కార్తీక పురాణ వైభవాన్ని వింటారు. అనంతరం వివిధ రకాల దానధర్మాలు ఆచరిస్తారు. ఇదంతా రోజు ఐదున్నర గంటల నుంచి ఆరున్నర వరకు జరుగుతుంది..

నలభై సంవత్సరాల నుంచి జ్యోతి యాత్ర

పూజారి పారువెల్ల రమేష్ శర్మ



సుల్తానాబాద్ పట్టణంలోని సాంబశివ దేవాలయం నుంచి కార్తీక జ్యోతి యాత్ర ఈ ఏడాదితో నలభై ఏళ్లు కావస్తుంది. అఖండ జ్యోతితో నగర సంకీర్తన జరుగుతుంది. ఆకాశ దీపోత్సవం వేడుకలు గ్రామ క్షేమం కోసం ప్రజలు సుఖ సంతోషాలతో ఉండడం, రైతులు పాడి పంటలతో తులతూగాలని జ్యోతి యాత్ర ఆచరించడం జరుగుతుంది. ఆశ్వీయుజ పౌర్ణమి మొదలుకొని కార్తీక పౌర్ణమి వరకు జ్యోతి కొనసాగుతుంది.

గుండె సంబంధిత వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సీపీఆర్ చేయడాన్ని నేర్పిస్తున్న వైద్య సిబ్బంది

సుల్తానాబాద్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, వైద్యుల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రముఖ గుండె సంబంధిత నిపుణులు అనీష్ పబ్బ సూచించారు. కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీపీఆర్‌పై ప్రజలకు నర్సింగ్ సూపరింటెండెంట్ లావణ్య ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ఎవరైనా హార్ట్ ఎటాక్ గురైతే సీపీఆర్ చేయడం వల్ల ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని అనీష్ తెలిపారు. అనంతరం గుండె జబ్బులు, వాటికి నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. అలాగే ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఐల రమేష్, వాకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మంద శ్రీనివాస్, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు రాజేంద్రప్రసాద్, మాజీ ఎంపీటీసీ అమిరిశెట్టి రాజలింగం, కోట కరుణాకర్, హరీష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల బృందం

పాలకుర్తి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని యూనివర్సల్ పాఠశాల విద్యార్థి ఎన్ అభిషేక్ జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు కల్వల సంతోష్ ఆదివారం తెలిపారు. ఈ నెల 14 నుంచి 17 వరకు రాజస్తాన్‌లోని రాజేష్ పైలోట్ స్టేడియంలో జరగనున్న సబ్ జూనియర్ నేషనల్ టెన్నీస్ బాల్ క్రికెట్ చాంపియన్ అండర్17 బాయ్స్ విభాగంలో ఎంపికయ్యాడు. కరస్పాండెంట్ మొహమ్మద్ ఇస్మాయిల్, ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ అఫ్జల్ విద్యార్థిని అభినందించారు.

ఉమ్మడి జిల్లా చదరంగం పోటీలకు ఎంపిక



ఎంపికైన వర్షిణి యాదవ్, వాసుదేవ్, అనిరుద్, అనన్య

సుల్తానాబాద్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు అన్ని రంగాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. పాఠశాలల క్రీడోత్సవాల్లో భాగంగా ఎలిగేడు మండల కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి చదరంగ పోటీల్లో నలుగురు విద్యార్థులు సత్తా చాటి ఉమ్మడి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఆదివారం నరేందర్ రెడ్డి అభినందించారు. ఎంపికైన వారిలో అండర్ 14 బాలికల విభాగంలో శ్రీవర్షిని యాదవ్, బాలుర విభాగంలో వాసుదేవ్, అండర్ 17 బాలుర విభాగంలో అనిరుద్, బాలికల విభాగంలో అనన్యలు ఉన్నారు. వీరిని ప్రిన్సిపాల్‌తోపాటు అధ్యాపక బృందం అభినందించారు.

చెట్ల పొదల తొలగింపు



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముళ్లపొదల తొలగింపు

కమాన్‌పూర్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఆదివారం రోడ్డుకు ఇరువైపులా విస్తరించిన ముళ్లపొదలు, చెట్ల పొదలను తొలగించారు. కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ బాధ్యులతోపాటు ఎస్ఐ కొట్టే ప్రసాద్ పర్యవేక్షించారు. అలాగే పెద్దపల్లి-మంథని ప్రధాన రహదారి వరకు చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, కోశాధికారి నల్లవెల్లి శంకర్, ఏఎస్ఐ రహీమ్, సభ్యులు లింగమూర్తి, అనవేన లక్ష్మీరాజం, నాయకులు వెంగలి రాజయ్య గౌడ్, జంగిలి పోచాలు, సజ్జనపు చొక్కయ్యలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి ఆర్థిక సహాయం

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన సింగరేణి విశ్రాంత కార్మికుడు జహీద్ కుమార్తె వివాహం సందర్భంగా ఆదివారం ఓసీపీ-1 డ్రాగ్‌లైన్ ఉద్యోగులు ఆర్థిక సహాయం అందజేశారు. దాదాపు 35 ఏళ్ళు పనిచేసి మరణించాడు. తోటి ఉద్యోగులు సేకరించిన రూ. 65,500ను జహీద్ కుటుంబ సభ్యులకు మాజీ డీజీఎం కొత్తకిషన్, ఆపరేటర్ చంద్రపాల్ చేతులమీదుగా అందజేశారు. మాజీ డ్రాగ్‌లైన్ ఆపరేటర్ రాంమోహన్, జహీద్ కుటుంబ సభ్యులు ఇజాజ్ అమేనా, ఖయ్యూమ్, జెబాతబస్సుమ్ ఉన్నారు.

కలెక్టర్ వైఖరిపై మంత్రికి ఫిర్యాదు



మంత్రికి వినతిపత్రం అందజేసిన అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): అంబే ద్కర్ విగ్రహాల ఏర్పాటు విషయంలో కలెక్టర్ కోయ శ్రీహ ర్షపై అడ్డుపడుతూ కుల వివక్షతో వ్యవ హరిస్తున్నారని మంత్రి జి.వివేక్ వెంకటస్వామికి ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు ఫిర్యాదుచేశారు. ఆదివారం మంత్రి వివేక్ నివాసంలో ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, బొంకూరి మధు, మైన రాజేష్‌లు లేఖను అందించారు. ఈ ఏడాది ఐదో తేదీ నుంచి 14వ తేదీ వరకు జరిగిన జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ జయం తోత్సవాల సందర్భంగా ఏర్పాట్ల విషయంలో దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్ళిన దళిత నాయకులపై అవహేళనతో మాట్లాడారన్నారు. అంబేద్కర్ విగ్రహాలను పెట్టకుండా 2013లో ప్రధాన రహదారుల పైన కొత్తగా విగ్రహాలు పెట్టొద్దని తీసిన సర్క్యూలర్‌ను పంపిస్తూ అడ్డుపడుతున్నార న్నారు. అందుకు సుల్తానాబాద్ మండలం మంచిర్యామి ఉదాహరణ అని మంత్రికి తెలిపారు.